డ్రగ్స్‌ను సమూలంగా కట్టడి చేయాలి

కర్నూలు (అర్బన్): జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ (ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఇందుకు సంబంధించి శాశ్వతంగా ఉండే విధంగా హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన డిజైన్ ఎస్పీ నుంచి వస్తుందని, ఆ మేరకు హోర్డింగులు ఏర్పాటు చేయాలని డీఈఓ శామ్యూల్‌పాల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు పాఠాల బోధన కోసం 600 పాఠశాలలను కనెక్ట్ చేస్తూ వర్చువల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దాని ద్వారా జిల్లాలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. యూట్యూబ్ లింక్‌ను కూడా క్రియేట్ చేసి అన్ని పాఠశాలలు, కళాశాలలు ఈ సదస్సులో పాల్గొనేలా చూడాలన్నారు. పొలాల్లో గంజాయి సాగుపై పూర్తి నిఘా ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. పాఠశాలల్లో ఇప్పటి వరకు ఎన్ని అవగాహనా సదస్సులు నిర్వహించారు, ఆర్టీసీ బస్సుల్లో ఎన్ని తనిఖీలు చేశారు నివేదికను అందజేయాలని డీఈఓ శామ్యూల్ పాల్, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులును ఆదేశించారు. అదే విధంగా సంబంధిత శాఖల అధికారులందరూ యాక్షన్ టేకెన్ రిపోర్టును అందజేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో కూడా గంజాయి సాగుపై నిఘా ఉంచాలని, అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారిని ఆదేశించారు. నగరంలోని బంగారుపేట నివాసులకు జీవనోపాధి మార్గాలు కల్పించాలన్నారు. ఎక్సైజ్, బీసీ సంక్షేమం, పోలీస్, డీఆర్‌డీఏ అధికారులు ఈ అంశంపై వారితో మాట్లాడి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల కల్పనపై చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి కల్పన, ఫ్యాక్టరీల్లో ఉద్యోగాల కల్పన తదితర మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం, సరఫరాను పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈగల్స్ అనే విభాగాన్ని చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని కళాశాలలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కో–ఆర్డినేటర్లుగా నియమించడంతో పాటు ప్రతి పాఠశాలకు ఒక పోలీసును కో–ఆర్డినేటర్‌గా నియమిస్తున్నామన్నారు. అదే విధంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు తరచూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్ల ద్వారా రవాణాను పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్లే బస్సులపై నిఘా ఉంచాలన్నారు. ఈ అంశంపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. బంగారుపేట ప్రాంతంలో నివసిస్తున్న వారికి వీటిపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్, డీటీసీ శాంతకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సింధు సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, రాయలసీమ, పుల్లారెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కాల్వబుగ్గలో ఎద్దుల బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో మార్చి 1వ తేదీ అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బజార్, కేవీ మధు, విజయకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుగ్గరామేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పాలపళ్ల విభాగంలో గెలుపొందిన వృషభ యజమానులకు వరుసగా రూ.లక్ష, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు అదే రోజు ఉదయం 8 గంటలలోగా రూ.800 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మార్చి 2వ తేదీ న్యూకేటగిరి ఎద్దుల బండలాగు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90 వేలు, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.1000 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 79694 64141, 83091 65221 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా శ్రీనివాసులు



కర్నూలు: కర్నూలు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కర్నూలు న్యాయవాది సి.వి.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 1999 సంవత్సరం నుంచి న్యాయవాదిగా వృత్తి నిర్వహిస్తున్నారు. శ్రీనివాసులు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. ఆయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు


ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు : ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు వస్తాయి తప్ప మధ్యవర్తుల ద్వారా రావని, ఈ విషయాన్ని నిరుద్యోగ యువత గుర్తుంచుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. నిరుద్యోగ యువత దళారుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగాల పేరుతో దళారులు నిరుద్యోగ యువతను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయన్నది గుర్తుంచుకోవాలన్నారు. సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగాలు, సచివాలయ ఉద్యోగాలు, హోంగార్డు ఉద్యోగాలు, కోర్టు, ఫుడ్ కార్పొరేషన్ ఉద్యోగాలంటూ పలు రకాలుగా దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోతునే ఉన్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసేవారి సమాచారాన్ని తెలియజేయాలని, అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి


తుంగభద్ర నదిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం మొద్ద నిద్ర వీడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. రైతు సంఘం నాయకులు, రైతులతో కలిసి తుంగభద్ర నదిని మంగళవారం పరిశీలించారు. కౌతాళంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం నదిపై బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణానికి పూనుకుంటోందని, అయినా మన ప్రభుత్వం మొద్ద నిద్ర విడడం లేదన్నారు. బ్యారేజ్ వల్ల మనకు జరిగే లాభం ఏమిటో తెలుసుకుని ముందుకు పోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కింద స్థాయి వారికి నష్టం జరుగకుండా వెంటనే కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈ పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ నిర్మాణం పూర్తి అయితే జిల్లాలోని పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలంగా మారి వలసలు నివారించవచ్చన్నారు. తుంగభద్ర నదిపై మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని దానితో పాటు కూడి కెనాల్‌ను నిర్మించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ సుబ్బారాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల అధ్యక్షుడు ఈరన్న పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం


మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

ఆదోని రూరల్: మిర్చి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అన్నారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోకుండా కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. మిరప ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని, దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. మిరప పంటకు గిట్టుబాటు ధరలు అందించాలన్నారు. బ్యాడిగ మిరపకు రూ.50 వేలు, మిగతా రకాలకు క్వింటాల్‌కు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 17వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు.. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు అయ్యప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రను పండుగలా నిర్వహించాలి

- గూగుల్ మీట్‌లో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి


గూగుల్ మీట్ ద్వారా మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (అర్బన్): స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ను, పూర్తయిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద ఈనెల 15వ తేదీన (మూడవ శనివారం) ప్రజాప్రతినిధులతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జీఎస్‌డబ్ల్యూఎస్, ఎస్‌బీఎం యాక్టివిటీస్‌పై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన ఆస్పైరింగ్ విలేజెస్‌ను రైజింగ్ విలేజెస్‌లా, అనంతరం రైజింగ్ విలేజెస్‌ను మోడల్ విలేజెస్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. రోజువారీగా ఇచ్చిన జీఎస్‌డబ్ల్యూఎస్ యాక్టివిటీస్ అయిన మిస్సింగ్ సిటిజన్స్, క్యాప్చరింగ్ ఆఫ్ హౌస్ ఇమేజ్, జియో కోఆర్డినేట్స్, ఎన్‌పీసీఐ యాక్టివ్ టేకెన్, ఎన్‌పీసీఐ ఇనాక్టివ్, ఈ–కేవైసీ ఆన్ పీఏసీ, 0–6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ కార్డుల జనరేషన్‌కు సంబంధించి లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేసి తద్వారా కర్నూలు జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. డీపీఆర్‌సీ కో–ఆర్డినేటర్ మంజుల వాణి పాల్గొన్నారు.

పథకాలకు చంద్రబాబు తిలోదకాలు

తుగ్గలి: మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి, ప్రకటించిన పథకాలకు తిలోదకాలిచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, మండలాధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మాజీ సభ్యుడు నారాయణనాయక్ తదితరులు మంగళవారం స్థానికంగా మాట్లాడారు. ఎన్నికల ముందు నోటికొచ్చిన హామీలిచ్చి అధికారం చేపట్టాక సూపర్‌సిక్స్ చూసి భయమేస్తోందని అంటున్న ముఖ్యమంత్రి పథకాలకు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడం బాబుకు కొత్తేమీ కాదన్నారు. సంపద ఎప్పటిలోగా సృష్టిస్తారో, పథకాలు ఎప్పటిలోగా అందిస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలోనూ తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో కూటమి నాయకులు అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై 8 నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. కూటమి నాయకులకు బుద్ధి చెప్పేలా మోసాలను ప్రజల్లోకి తీసుకెళతామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, బీమానాయక్, నాయకులు, ఉప్పర్లపల్లి ఉప సర్పంచ్ రామాంజి, ఈశ్వరరెడ్డి, కృష్ణానాయక్, రత్నానాయక్, సురేష్ పాల్గొన్నారు.


తెలుగువారి గుండెల్లో ఘంటసాలకు సుస్థిర స్థానం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు(హాస్పిటల్): తెలుగు వారి గుండెల్లో దివంగత మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు శాశ్వత స్థానం ఉంటుందని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అభిప్రాయపడ్డారు. స్థానిక సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఘంటసాల ఆరాధన ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు రాత్రి హైదరాబాద్ నుంచి కళాకారులతో సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఘంటసాల తన గానంతో, పాటలతో తెలుగువారి మనసును దోచుకున్నాడని తెలిపారు. ఇప్పటికీ ప్రతి పల్లెలో ఆయన పాటలు మారుమ్రోగుతుంటాయన్నారు. మూడు రోజుల నుంచి వివిధ ప్రాంతాల నుంచి గాయకులు వచ్చి ఘంటసాలను గుర్తుచేసుకుంటూ పాటలు పాడుతూ ప్రేక్షకులను అలరించారన్నారు. ఆధ్యాత్మిక వేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ ఘంటసాల పాడిన పాటలు ఇప్పటికీ మరచిపోలేమన్నారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య, మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, ఆర్జా రామకృష్ణ, కేజీ గంగాధర్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, త్రీటౌన్ సీఐ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గానం అజరామరం అని వక్తలు కొనియాడారు. పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో మంగళవారం చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని ఘంటసాల విగ్రహం వద్ద ఆయన 51వ వర్ధంతిని నిర్వహించారు. డాక్టర్ డబ్ల్యూ సీతారాం, డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ బి.శంకర్ శర్మ, డాక్టర్ ఎ.నగేష్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య పాల్గొని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లా డుతూ.. సినీ గీతాలకు, లలిత గీతాలకు గొప్ప గౌరవా న్ని తెచ్చి పెట్టిన మధుర గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల అన్నారు. ఐక్యరాజ్య సమితిలో గీతాలాపన చేసి ఆంధ్రులకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన ఆ మహానుభావుడి గాన మాధుర్యాన్ని భావితరానికి అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు సుస్వరం వాసు దేవమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయకులు సుధారాణి, ఎలమర్తి రమణయ్య, సమితి కార్యదర్శి రాఘవేంద్ర ప్రసాద్, కోశాధికారి జగన్నాథగుప్త, సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

ఎల్లమ్మకు విశేష పూజలు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ఎమ్మిగనూరురూరల్: పశ్చిమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని అఖిల భారత కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో రైతాంగం, కూలీలు కరువు కాటకాలతో వలస వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు హనుమంతప్ప, నాగేంద్ర, పెద్దారెడ్డి, డివిజన్ నాయకులు నరసింహులు, ఉరుకుందు, రాఘవేంద్ర, మోనయ్య, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆలూరు: చిప్పగిరి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి 8.50 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిప్పగిరి మండలంలోని బెల్డోణ గ్రామానికి చెందిన రమేష్ (31) సొంత పని నిమిత్తం బైక్‌పై గుంతకల్లు పట్టణానికి వెళ్లారు. పని ముగించుకుని సొంత గ్రామానికి వస్తుండగా చిప్పగిరి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు అకస్మాత్తుగా గొర్రెలు అడ్డంగా రావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర రక్తగాయాలకు గురై స్పృహ తప్పి పడిఉన్న రమేష్‌ను చూసిన వాహనదారులు వెంటనే 108కు సమాచారాన్ని చేరవేశారు. అంబులెన్స్ సిబ్బంది అతన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఘటనపై పోలీసులు రమేష్ బంధువులకు సమాచారం అందించి ప్రమాదంపై విచారణ చేపట్టారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర కమిటీ ఎన్నిక

కర్నూలు: ఏపీడబ్ల్యూజేఎఫ్ కర్నూలు నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక లలిత కళా సమితిలో మంగళవారం జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీలో విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కర్నూలు నగర గౌరవాధ్యక్షుడిగా బి.శివకుమార్, అధ్యక్షుడిగా శివశంకర్, నగర ప్రధాన కార్యదర్శిగా ఎర్రమల, కోశాధికారిగా జగదీష్, ఉపాధ్యక్షులుగా పరుశురాం, బాబు, సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, రమేష్, కార్యవర్గ సభ్యులుగా నరసిరెడ్డి, శ్రీరాం, నాగరాజు, రామకృష్ణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి తెలిపారు.

హామీలు అమలు చేయాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ భవనం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు సొంతిల్లు లేని లబ్ధిదారులతో కలిసి ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో వందలాది మంది ఇంటి స్థలాలు లేని నిరుపేదలు పూరి గుడిసెల్లో, అద్దె ఇళ్లలో నివసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్ల స్థలం ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు వీరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాలి

- నెలాఖరులోపు చెల్లించకపోతే జరిమానా
- మార్చి 1 నుంచి 25 శాతం, ఏప్రిల్ నుంచి 50 శాతం పెనాల్టీ
- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారాలు చేసే ప్రతి యజమాని తప్పనిసరిగా 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్సు ఫీజులను ఈనెల 28వ తేదీలోపు చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత గడువు దాటితే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 25 శాతం పెనాల్టీ చెల్లించాలని, అలాగే ఏప్రిల్ 1 తరువాత ట్రేడ్ లైసెన్సు ఫీజుతో పాటు 50 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్సు ఫీజు కట్టిన షాపులకు సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ద్వారా కరెంట్ మీటర్, బ్యాంకు ద్వారా రుణం, లేబర్ ఆఫీసు నుంచి లేబర్ సర్టిఫికెట్ సులువుగా పొందవచ్చని వివరించారు. నిబంధనలు పాటించకుండా ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించని వ్యాపారుల షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. చట్ట ప్రకారం బకాయి ఉన్న ట్రేడ్ లైసెన్సు ఫీజులను వసూలు చేస్తామని పేర్కొన్నారు.

నేడు చెన్నకేశవస్వామి రథోత్సవం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన కొలుట్ల చెన్నకేశవస్వామి వారి రథోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామం, విశేషాలంకరణ, గజవాహన ఉత్సవం, సాయంత్రం నుంచి శ్రీవారి రథోత్సవం చేపడతామన్నారు. తర్వాత ఊంజల సేవ, తిరునామ సంకీర్తనలు, వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగు తుందన్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచేగాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు.

బాపురంలో బసవేశ్వరస్వామి రథోత్సవం

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో బుధవారం బసవేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు గంగపూజ, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీవారి పాదపూజ, ప్రసాద వినిమయం, గణారాధన కార్యక్రమాలు జరిగాయి. బుధవారం ఉదయం 3 గంటలకు మహారుద్రాభిషేకం, 5 గంటలకు బసవేశ్వరస్వామి ఉచ్చాయోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎల్లార్తి దర్గాలను వక్ఫ్ బోర్డే నిర్వహించాలి


దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల నిర్వహణను టెండర్ ద్వారా ఇతరులకు అప్పగించకుండా వక్ఫ్ బోర్డు అధికారులే చూసుకోవాలని మంగళవారం గ్రామస్తులు, భక్తులు మాబాషా, రాముడు, కృష్ణ, డీలర్ ఈరన్న తదితరులు డిమాండ్ చేశారు. ఇప్పటికే విజయవాడలో ఈ నెల 18న దర్గాల నిర్వహణ విషయంపై టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారని అందుకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చారన్నారు. నెలకు రూ.20 లక్షలు పైగా చెలించేలా టెండర్ నిబంధనలు పెట్టారని, తద్వారా టెండర్ దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు సేవల విషయంలో విపరీతంగా ధరలు పెంచి భక్తులను నిలువు దోపిడీ చేసే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నతాధికారులు స్పందించి దర్గాల నిర్వహణకు టెండర్ కాకుండా వక్ఫ్ బోర్డు పరిధిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

లాలూస్వామి ఉరుసు ప్రారంభం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ రోజు గంధం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, మంగళ వాయిద్యాల నడుమ రాత్రి 11 గంటల నుంచి పురవీధుల గుండా అశ్వంపై కొనసాగింది. కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉరుసు సందర్భంగా పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామం కళకళలాడింది. ఉదయం నుంచే గ్రామస్తులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12న ఉరుసు, జానపద సంగీత విభావరి, 13న కిస్తీ కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


వైద్య సేవలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని నోడల్ అధికారి రఘు అన్నారు. మంగళవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 32 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా 9వ తేదీ షుగర్, హెచ్ఐవీ, బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. రక్తహీనత నివారణకు క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్లు హేమలత, అబ్దుల్ హమీద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ తనిఖీ


హాస్పిటల్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సాయి మేఘా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, స్కానింగ్ కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ తనిఖీ చేశారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రంలోని రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని హాస్పిటల్స్, స్కానింగ్ కేంద్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని యాజమాన్యాలను ఆదేశించారు. వైద్యుల అర్హత సర్టిఫికెట్లు డిస్‌ప్లే చేయాలని, లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదని హెచ్చరించారు. అలా చేసిన వారిపై పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ కోసం అన్ని అర్హతా ప్రమాణాల ప్రకారం దరఖాస్తు చేయాలన్నారు. ఆమె వెంట డెమో శ్రీనివాసులు శెట్టి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి ఉన్నారు.

DOCUMENTS MISSING

I, S.SUBRAMANYAM S/o Late S.RATNAMAIAH, R/o Balaji Nagar, Kurnool City, Kurnool Dist., Have State that I Lost My Mother's (S.L.NARSAMMA), Anantapur (Dist), Papampeta Rural, Sy.No. 34-3, 34-1, 34-5, 34-2, 34-6, 34-7, Original Document No: 728/1974, dated: 30.01.1974 with respect to the Plot No:9 Pyki of Land Draff of Plots While I was Travelling in Auto From My House on 01.01.2025 Around 10:30 AM. So If any Body Found that Document, Plese Contact the below Mentioned.

S.SRINIVASA RAO, Advocate, Kurnool. Ph No: 90523 37698.